


# తాజ్ మహల్

కోలపల్లి ఈశ్వర రావు

మోడు వారిన కొమ్మల్లోంచి బ్రతుకు ఎండిన ఓ పండుటాకు నేల రాలిన చప్పుడుకు చివుక్కున కళ్ళు తెరిచాడు చంద్రుడు. మూడు రోజులుగా అవిరామంగా కారిన కన్నీళ్ళు చెంపల మీద ఎండిన చారికలుగా రూపుదిద్దుకుంటున్నాయ్. వెక్కిళ్ళతో ఎగిరెగిరిపడిన ఎద లు భావరహితమై బండబారిపోతున్నాయ్. కారణం... చీకటిలో... వేకువలో... వేదనలో... వేడుకలో అతడిని అంటిపెట్టుకునీ తిరిగే చుక్క హఠాత్తుగా మాయమైంది అతడి చూపు చొరబడని లోకాలకు... అతడి పిలుపు వినబడని తీరాలకు పయనమైపోయింది.

చుక్క... నిజంగా చుక్కే...

చుక్క నవ్వితే... పూలు పూసినట్టు ఉంటుంది. చుక్క చూపులో వెన్నెల్లు కాసినట్టు ఉంటుంది. ఆమె పలికితే పగడాలనీ... నడిస్తే నాట్యాలనీ ఊరూ వాడా పొగిడిపోతుంటారు. పాలదారుల్లో విహరిస్తున్న అప్సర పొరపాటున కాలు జారి నేలకు చేరిందని చెవులు కొరుక్కుంటూ ఉంటారు.

అంత అందమైన చుక్క చంద్రుడి సొత్తు. అతడికి ఆరో ప్రాణం. ఎంతటి ప్రాణమంటే... తన రక్తాన్ని చిందించి ఆమెకు పారాణి అద్దమన్నా అతడు సిద్ధం. తన ఊపిరులన్నీ ఊయల చేసి, గుండెను పక్కగా పరవమన్నా అతడికి ఆనందం. షాజహాన్ ముంతాజ్‌ను ఎంతగా ప్రేమించాడో... కృష్ణుడు రాధను మరెంతగా ఆరాధించాడో... కచ్చితంగా... అంతకన్నా కోటి రెట్లు ఎక్కువగా చంద్రుడు చుక్కను ప్రేమించాడు.

కానీ... రాగద్వేషాలకు అతీతమైన మృత్యువు...

అనాది నుంచీ ఎంతో మంది ప్రేమికుల్ని తనలో ఐక్యం చేసుకుంటున్న మృత్యువు... చుక్కను కూడా మామూలుగా... చాలా సహజంగా కబళించివేసింది.

కానీ... చుక్క మరణం చంద్రుడికి మామూలుగా... సహజంగా లేదు. అసహజంగా, అనుమానుషంగా ఉంది. తమ అనురాగాన్ని చూడలేని విధి ఈర్ష్యాద్వేషాలతో చుక్కను తన నుంచి వేరు చేసినట్టుగా ఉంది.

అందుకే... అతడు... విధిని శపిస్తున్నాడు... దేవుడ్ని నిందిస్తున్నాడు... మృత్యువుని పరిహసిస్తున్నాడు.

"సెంధ్రుడా! ఏంట్రా ఇది... ఏ కన్ను మిన్నేరయితే మటుకు పోయినోల్లు వొస్తారా? రునం తీరిందీ... సుక్క సుక్కల్లో కల్సింది."

ఓదారుస్తున్న లోకం వంక వెర్రిగా చూశాడు - "పోవే... పాడు లోకమా... ఏడికాడికి సర్దిసావుకునీ... మనసు సరిపుచ్చుకునీ... సోర్ధంతో బతికెయ్ నాటికి నానేం... అట్టా టిట్టాటి మడిసిని గాను. పేమంటే తెల్సినోన్ని... పేమను పేనంగా పేమించేనోన్ని..."

"మనసు సరిపుచ్చుకోక... సుక్కతో పాటీ సస్తావా?

"సావను... నాను సత్తే... నాతో పాటీ సుక్కను మర్సిపోతారు మీరు... నాను బతుకుతాను... సుక్క కోసం బతుకుతాను. బతికీ... సుక్క పేరు... సుక్కలున్నంత మటికీ గేపకముండేలాగా సేస్తాను."

"ఎట్టెటా... తాజుమాల్ గట్టిస్తావా?"

కినుక్కుమంటున్న లోకాన్ని కసిగా చూశాడు చంద్రుడు.

*** *** ***

చంద్రుడు ఏడవటం మర్చిపోయాడు... కానీ - చుక్కను మర్చిపోలేదు. రోజూ తూర్పున సూర్యుడు ఉదయిస్తున్నంత సత్యంగా, అతడి మనసులో ఆమె రూపం ఉదయిస్తూనే ఉంటుంది.

చంద్రుడు దిగులు పడటం మానేశాడు. కానీ - చుక్కను ప్రేమించటం మానలేదు. ఏటి నీటి కెరటాల మీదుగా వీస్తున్న గాలి అలలంత స్వచ్ఛంగా అతడు ఆమెను ప్రేమిస్తూనే ఉన్నాడు.

ఇది వరకైతే... చుక్క సన్నిధిలో ఉన్నప్పుడే లోకాన్ని మరిచేవాడు... ఇప్పుడైతే లోకమంతా అతడికి చుక్క సన్నిధే.

ప్రతిక్షణం... అతడి నుదుట చెమట బిందువవుతోంది... ప్రతి చెమట బిందువూ... అతడి చేతిలో పైసాగా చేరుతోంది. ఆ పైసలన్నిటితో ఒక తాజ్‌మహల్‌ని కాకున్నా... కనీసం చుక్క సమాధిని నిర్మించాలనీ... ప్రతి రాత్రీ చుక్కలు పూచే వేళకు ఆ సమాధి ముంగిట దివ్వెను వెలిగించాలనీ... ఆ వెలుగుల్లో చుక్క నవ్వుల మెరుపుల్ని చూడాలనీ... అతడి కోరిక.

"పరవాలేదు. సెంధ్రుడు మడుసుల్లో పడ్డాడు. బెంగపోయింది. దిగుల్దీరింది."

"ఆడి మొహం - దిగుల్దీరటవా... పాడా - కూడవెట్టిన డబ్బుల్తో సమాధి గడతడంట. బతికున్నోల్లకు బువ్వ లేదు గాని... సచ్చినోల్లకు సమాదులు."

"ఆడి పేమ అట్టాటిది - సుక్క అదృష్టం. సెంధ్రుడిలాంటి పెనిమిటి నీకూ... నాకూ... దొరుకుతాదేటి?"

ఈ వ్యాఖ్యానాలేవీ చంద్రుడి చెవికి చేరవు. చేరినా పట్టవు. అతడి మార్గం ఒక్కటే... అది శ్రమ. ఆ శ్రమకు ఫలితం ఒక్కటే... అది డబ్బు... ఆ డబ్బు ధ్యేయం ఒక్కటే... అది ప్రేమకు మందిర మవడం.



ఆటోగ్రాపు

**ఆటోగ్రాపులు సంతకాలు చేసి చేసి విసిగిపోయిన ప్రముఖ నటుడు అభిమాని నుండి ఆటోగ్రాపు పుస్తకం తీసుకుని గాడిద బొమ్మను వేశాడు. ఖంగుతిన్న అభిమాని చమత్కారంగా అయ్యా నే నడిగింది మీ ఆటోగ్రాపు కాని, మీ ఫోటోగ్రాపు మాత్రం కాదు అని అన్నాడు.**

**వల్లాల సుషమ [బలపాల]**

షాజహాన్ ప్రేమకు - చంద్రుడి ప్రేమకు తేడా ఏం లేదు. అతడు చక్రవర్తి కనుక పాలరాతితో తాజ్‌మహల్ కట్టాడు. ఇతడు నిరుపేద కనుక గుండె ముక్కలతో సమాధి కడతాడు.

*** *** ***

"సమాధి గట్టాలంటే స్థలం కొనాల గదా. ఆ కర్సూ... కట్టుబడి కర్సూ అంతా కలేసుకుంటే... ఎయ్యి వదే నొందలవుద్ది. అదీ గాక నువ్ బాగా కట్టాలంటున్నావ్ గదా... సేతిలో ఎంత లేదన్నా రెండేలుంచుకో అప్పుడు మాట్టాడు.

కాటికాపిరి లాంతరు వెలిగించి చూరుకు వేలాడదీశాడు.

"రెండేలా?" చంద్రుడు లాంతరు వెలుగుల్లో కాటికాపిరి వంక చూశాడు.

"అవ్.. రెండేలు సులాగ్గా అయిద్ది" కాటికాపిరి నిట్టాడికి ఆనుకుని కూర్చుని నిట్టూర్చాడు.

"నా వద్ద ఎయ్యేనే వుంట - మరో ఎయ్యంటే... ఇంకొన్నాల్లు పోవాల" చంద్రుడు తనూ నిట్టూర్చాడు.

కాటికాపరి మాటాడకుండా వెలుగుతున్న లాంతరుకేసి చూస్తూ అలాగే వుండిపోయాడు. వృద్ధాప్యపు నీడలు సోకిన అతడి ముఖం ...పండుటాకుల్ని మోస్తున్న కొమ్మలా వుంది.

చంద్రుడు వెళ్ళటానికి లేస్తూ ఏదో గుర్తుకు వచ్చినట్టు అడిగాడు. "తాత ... అవ్వ కానరాడం లేదే?"

వృద్ధుడి కళ్ళలో పడుతున్న లాంతరు వెలుగులు, కన్నీటి చుక్కలుగా మారి ముడతలు పడ్డ చెంపలమీదకు జారాయి - "కానరాదు బాబూ... ఇంకొన్నాల్లు గడిస్తే అసలికి కానరాదు."

"ఏందే తాతా... ఏమైనా దవ్వకు?"

"పేదోల్లకు ఏమవుతదో అదే అయ్యింది జబ్బొచ్చింది. వచ్చిందని తెల్సినా డబ్బు లేక వల్లకున్నం. ముదిరింది. ముదిరిందని ఎరిగినా మిన్నకున్నం. పేనం మీనికొచ్చింది. అందరి కాల్లూ పట్టుకుని ఆస్పత్రిలో అయితే సేర్పినా గాని ... దాని వైజ్జగానికి డబ్బేడదెచ్చేది? ఎయి రూపాయలవుద్దంట ఆప్రీసన్‌కి... పోనీ బాబూ ... పోనీ ... ఎట్ట బోయేటోల్లని అట్టబోనీ ఆ వృద్ధుడి స్వరం గద్గదమైంది.

"అదేంది తాతా, అట్టంటవ్ ఎట్టాగా సూసుకుని అవ్వను కాపాడుకో" - చంద్రుడు జాలిగా చూశాడు.

అది నా వల్ల గాని పని బాబూ. రునం దీరిపోయింది. పోతోంది పోనీ...." నిర్వేదంగా వున్నాయి వృద్ధుడి మాటలు.

"ఏంటది తాతా .. మరీ ... బొత్తిగా పేమలేనట్టు మాటాడతావ్"

చంద్రుడన్న ఆ మాటకు కదిలాయి వృద్ధుడి గుండెలు. కదిలిన గుండెల క్రింద నుండి లేచింది పువ్వెత్తున ఓ కన్నీటి కెరటం.

"పేమ లేదా! ఎంత మాటన్నావ్ బాబూ... నా గుండె నిండా పేముంది. నా కల్ల నిండా పేముంది. నా ఒంట్లోని పెతి నెత్తుటి బొట్టులో అదంటే సెప్పలేని అభిమాన వుంది. కానీ ... నాకు లేందొక్కటేనయ్యా .. డబ్బు .. అదుంటేనయ్యా .. గుండెల్లోనే పేమకు సమాధి గట్టి, జరిగేదాన్ని సూత్త కూకున్నా."

చంద్రుడు మౌనంగా విన్నాడు. తాతకేసి చూస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎన్నో నిమిషాలకాలం నిశ్శబ్దంలో నిశ్శబ్దంగా కరిగిపోయాక నిశ్శబ్దాన్ని బ్రద్దలు చేస్తూ చంద్రుడి పెదవి కదిలింది.

"తాతా... ఆ మట్టిలో నా సుక్క వుందంటావా?" చక్కని ఖననం చేసిన ప్రదేశం వంక వేలుపెట్టి చూపుతూ అడిగాడు.

"ఛ .. సుక్క మన్నులో వుంటాదా! నీ గుండెల్లో వుంటాది గాని. మాసిపోయే కాయంలో ఏమున్నాది బాబూ.. మనసులో వున్నాది గాని. ఆ పిల్ల మనసు నీ మనసులో ఏనాడో కల్సిపోయింది." వృద్ధుడు చంద్రుడి తలను ఆప్యాయంగా నిమిరాడు.

చంద్రుడి కళ్ళలో నుంచి ఓ కన్నీటి చుక్క చప్పున రాలిపడింది. "నువ్ సెప్పింది సెత్తం తాతా. నా సుక్క ఈ మట్టిలో ఎందుకుంటాది? నా మనసులో వుంటాది గాని. తాతా! నా మనసులోంచి సుక్క మనసు ఏమిటంటా వుందో తెల్సా?" చంద్రుడు ఆగాడు.

వృద్ధుడు ఆర్ద్ర నయనాలతో చంద్రుడ్ని చూశాడు. చంద్రుడు చెప్పాడు. "సెంద్రం మామా! నాను నీలోనే వున్నాను. ఏమీ లేని మన్నులో సున్నపు గోడలు లేపటానికి డబ్బులు దండగ చెయ్యొవాకు. నీ మనస్సులో కట్టిన తాజుమహల్ సాలు నాకు. నా సమాధి కోసం కూడబెట్టిన డబ్బు మరొకరు సమాధి కాకుండా కాపాడగల్గితే సాలు. ఆ డబ్బు తాత కిచ్చి రామిని బతికిచ్చు. కాదు. ... కాదు పేమను బతికిచ్చు. అదే నాకు నిజమైన తాజుమాలు. అని సెపుతుంది నా సుక్క ఏం ..తాత! అది సెప్పేది నిజవేనా!"

"బాబూ!" ఆ వృద్ధుడు అమాంతం చంద్రుడ్ని అక్కున చేర్చుకున్నాడు. అతడి కళ్ళ నుండి కురుస్తున్న ఆనందబాష్పాలు చంద్రుడి తలను అభిషేకిస్తున్నాయి.

"తాతా! అవ్వ ఇంటి కొచ్చినాక సెప్పు తాతా... నా సుక్కను దీవించమని" - వెయ్యి రూపాయలూ తీసి వృద్ధుడి చేతిలో పెట్టి వడి వడిగా అడుగులు వేస్తూ సాగిపోయాడు చంద్రుడు.

దోసిట్లోని డబ్బును అబ్బురంగా చూసుకుని తలెత్తిన వృద్ధుడికి దూరంగా... నీలి నింగిలో చంద్రుడికి బాగా దగ్గరలో మిలమిలా మెరుపులీనుతున్న నక్షత్రం కనబడింది.

"సుక్కని మేము దీవించేదేంటి బాబూ .. సుక్కలున్నంత మటికీ మీరే మమ్మల్ని దీవిస్తుండాల"

వృద్ధుడి పెదవులు అస్పష్టంగా కదిలాయి.

★